# ఆధునిక నీతి కథలు 

పొట్లూరు నాగేశ్వరరావు

కోర్కెలు కొంతమందికి కొవ్వొత్తులు; మరికొంతమందికి కొండరాళ్లు; ఇంకొంతమందికి కొబ్బరిపువ్వులు. ముత్యాలరావు విషయంలో కోర్కెలు ఆ మూడో తరగతికి చెందినవని చెప్పొచ్చు.

పాతికేళ్ళ క్రితం ప్రభుత్వం సర్వీసులో చేరినప్పట్నుంచీ ముత్యాలరావుకు కారు కొనాలనే కోర్కె వుండేది. పదిహేనేళ్ల ప్రభుత్వ సర్వీసు గడిచేటప్పటికి సొంతంగా కారు కొనడంలో గొప్పేముంది, ప్రభుత్వ వాహనాన్ని వాడుకోవడంలో జీవితానికి ఇహపర సుఖాల సార్థక్యత వుందని భార్య బోధించింది. పైపెచ్చు జడ్జీ గారి భార్య, డి.ఇ.వో భార్యా, ఫిషరీస్ డిప్యూటీ డైరక్టరు భార్యా, మార్కెటింగ్ డైరక్టరు భార్యా— ఇలా ఎంతోమంది పెద్ద ఆఫీసర్ల భార్యలు ప్రభుత్వ వాహనాన్ని పనిమనుషులకంటే హీనంగా వాడుకోవడాన్ని దృష్టాంతరాలుగా చూపెట్టింది. 'నిజం అంతే' అనుకున్నాడు ముత్యాలరావు

మరి అయిదేళ్ళలో ప్రమోషన్ వచ్చింది ముత్యాలరావుకు. ఇంకో అయిదేళ్లలో మరో ప్రమోషన్ వచ్చింది. అదృష్టం ఆకస్మాత్తుగా కౌగలించుకున్నట్టు ఒక కార్పొరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టరయ్యాడు ముత్యాలరావు.

ప్రభుత్వోద్యోగాల్లో ప్రమోషన్లు ఎక్కువగా అనుభవాన్నిబట్టి గానీ, సామర్థ్యాన్నిబట్టి కావనేది సార్వజనీన సత్యం. ప్రభుత్వ సిబ్బంది యంత్రాంగంలో అరిగిపోయిన యంత్రపరికరాలకు విలువ హెచ్చు; అధికారం జాస్తి; అనుసంగిక సదుపాయాలు మెండు.

## ప్రభుత్వ వాహనం-4

ఓ కార్పొరేషన్‌కు ఎం.డి. అయిన ముత్యాలరావుకు చిలకాకుపచ్చ రంగు మార్క్ ఫోర్ ఎంబాసిడర్ కారు కేటాయించబడింది. ఛార్జి పుచ్చుకున్న రోజున ఆ కారులో దర్జాగా వెనకసీట్లో కూర్చుని కుడిచేతిని సీటుమీదుగా వేసుకొని ఆరగంట ముందుగా ఇంటికొచ్చాడు. ఆ కారునూ, ఆ కారు రంగునూ, అందాన్నీ హంగుల్నీ, అందుబాటులో వుండటాన్ని చూసి ముత్యాలరావు భార్య మూడువేల రూపాయల కంచిపట్టుచీర కానుకగా లభించినంత మురిసిపోయింది. వెంటనే ఆ కారెక్కి ఆదర్శనగర్‌లో వున్న ఓ ఫ్రెండ్‌ను పలకరించివచ్చింది.

ఆ కార్పొరేషన్‌కు ఎం.డి కావడం ఒక అదృష్టంగా ముత్యాలరావు భావిస్తే, కొత్త ఎంబాసిడర్ యోగం పట్టడం డబుల్ అదృష్టంగా భావించింది ముత్యాలరావుభార్య. మొగుడికంటే తానె ఎక్కువగా ఆ కారును ఉపయోగించసాగింది. ముత్యాలరావు అడ్డుచెప్పేవాడు కాదు. ఎందుకంటే ఆయన ఆమె పైట చెంగున కట్టిన చిల్లరడబ్బుల మూటలాంటి వాడు.

పిల్లల్ని స్కూళ్లలో దించడానికీ, స్కూళ్ళనుంచి ఇంటికి తీసుకురావడానికీ, స్నేహితుల ఇళ్ళకు వెళ్లడానికీ, షాపింగ్‌కూ; షికార్లకూ; సినిమాలకూ; ప్రయివేటు ఫంక్షన్లకూ; దేవాలయాల దర్శనాలకూ; గేదెకు గడ్డితేవడానికీ— మొదలైన పనులన్నింటికీ ఆఫీసు కార్ను వాడడం మొదలెట్టింది ముత్యాలరావు భార్య. ఈ విషయాన్ని ఆఫీసులో ఆగుబ్బగా చెప్పుకోసాగారు.

ఓరోజు ఆఫీసు స్టేషనరీ ఇన్‌ఛార్జి ఎల్‌డిసి ఓ రీము కాగితాలు అమ్ముకొన్నాడనే అభియోగంమీద ఓ సంవత్సరం ఇంక్రిమెంట్ ఆపుచేయించాడు ముత్యాలరావు. ఆ ఎల్‌డిసి ఎం.డీని ప్రార్థించలేదు అయితే బహిరంగంగా విమర్శిస్తూ వచ్చాడు.

పక్షం రోజుల తర్వాత ఓ స్థానిక పత్రికలో 'ఓ కార్పొరేషన్ కారు దుర్వినియోగం' అనే శీర్షిక క్రింద ముత్యాలరావు కారును ఎట్లా దుర్వినియోగం చేస్తున్నది నాలుగు ఫోటోలతోసహా వచ్చింది. ఒక ఫోటోలో— ముత్యాలరావు భార్య పిల్లలూ ఒక సినిమాహాలు దగ్గర కారులోంచి దిగుతున్నట్లూ, రెండో ఫోటోలో ఒక కూరగాయల దుకాణం దగ్గర కారు ఆపి ఆమె కూరలు కొంటూ

న్నట్లూ; మూడో ఫోటోలో ఒక క్లాత్ ఎంపోరియం ముందు ఆమె కారు దిగుతున్నట్లూ;నాలుగో ఫోటోలో ఒక దేవాలయం ముందు ఆమె కారు ఎక్కుతున్నట్టూ, ఆ కారును కేవలం ఇంటిపనులకే ఎం డి గారు ఉపయోగిస్తున్నట్టూ నెలకు ఆ కారుకు పెట్రోలుకు రెండువేల రూపాయలు అవుతూన్నట్టూ, ఒక ప్రభుత్వోద్యోగి ఒక ప్రభుత్వ వాహనాన్ని సొంతపనులకు వాడుకొని డబ్బును దుర్వినియోగం చేయడం సహించరాని నేరమనీ వెంటనే దర్యాప్తు జరిపించాల్సిందనీ పత్రికలో వచ్చింది,

ఆ పత్రికలో వచ్చిన వార్తల ఆధారంగా అసెంబ్లీలో ప్రశ్నలు వచ్చినాయి.

ముత్యాలరావు సంజాయిషీ యిచ్చుకోవాల్సివచ్చింది.

'తామంటే గిట్టనివాళ్ళు అసూయతో కళ్ళల్లో కారం జల్లుకున్నారని' వాపోయింది ముత్యాలరావు భార్య.

ముత్యాలరావు సంజాయిషీ స బ బు గా లేదనీ, కార్పొరేషన్ నిధులను నేరుగా దుర్వినియోగం చేయడం ద్వారా పద్నాలుగు వందలు అధికంగా ఖర్చు చేయడం జరిగిందనీ ఆ మొత్తాన్ని ఆయన జీతంలో రాబట్టుకోవాలనీ, ఆయనను తక్షణమే కారులేని మరో ఆఫీసుకు బదిలీచేయాలనీ పై అధికార్లు నిర్ణయించి, ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

దీని కంతటికీ పెళ్ళాం అవివేకం కారణమని ముత్యాలరావు విసుక్కోగా, మొగుడి అసామర్థ్యకు హేతువని ఆమె విరుచుకుపడింది.

*పాలిచ్చే గవిడగేదె లాంటిది గవర్నమెంటు ఉద్యోగం: ఎటొచ్చీ ఆ గేదెకు గడ్డికూడా గవర్నమెంటు సొమ్ముతోనే కొన్నప్పుడే ఇబ్బందులు ఎదురవుతాయి.*

---